# అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- సొంత భవనాలు కరువు
- ఏడేళ్లు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు

భీమిని: బెల్లంపల్లి నియోజకవర్గంలో భీమిని మండలం నుంచి కొత్తగా కన్నెపల్లి మండలం 2016లో ఏర్పాటైంది. మొత్తం 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలం ఏర్పాటై ఏడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. కన్నెపల్లిలో కేజీబీవీ తప్పా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భూములు కేటాయించారు. ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. దీంతో అద్దె భవనాల్లో కార్యకలాపాలు సాగుతుండడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, ఐకేపీ, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఇవన్నీ అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయం, ఐకేపీ ప్రాథమిక ఆరోగ్య సబ్‌సెంటర్‌లు అద్దె భవనంలో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలోని కొన్ని గదుల్లో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. పోలీస్‌స్టేషన్, కార్పెంటర్ సంఘ భవనంలో ఏర్పాటు చేశారు. ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ బదిలీపై వెళ్లడంతో ఆయుర్వేద వైద్యశాల మరుగునపడిపోయింది. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఉన్నప్పటికీ గ్రంథాలయం అందుబాటులో లేదు. ఉమ్మడి భీమిని మండలంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి ఆరోగ్య సేవలు పొందడం కష్టంగా ఉందని కన్నెపల్లిలో ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**గదులు అరకొరగా..**

ప్రైవేట్ భవనాల్లోని గదులు అరకొరగా ఉండటంతో ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు అధికారులు ఉండి ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కూర్చోవడానికి కుర్చీలు లేక, తాగడానికి నీళ్లు దొరకని పరిస్థితి ఉంది. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. సర్వసభ్య సమావేశాలు, ఇతర అధికారిక కార్యక్రమాలను అంబేద్కర్ సంఘ భవనం, రైతు వేదిక, ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పక్కాగా భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

### ప్రభుత్వ భవనాలు నిర్మించాలి



కన్నెపల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వివిధ పని కోసం వచ్చిన ప్రజలకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– భట్టు శ్రీనివాస్, కన్నెపల్లి

### పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



కన్నెపల్లిలో పీహెచ్‌సీ లేక భీమిని మండల కేంద్రానికి వెళ్లి మందులు, పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుంది. కన్నెపల్లి మండలం ఏర్పాటై ఏళ్లు గడిచింది. ఇప్పటికైనా పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి.

– గోమస దాగయ్య, కన్నెపల్లి

# 23న ప్రాపర్టీ ఎక్స్‌పో

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీ వద్ద గల స్వాగత్ ఫ్రైడ్ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 23న ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల డిస్ట్రిక్ట్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. మంచిర్యాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోందని, అన్నివర్గాల ప్రజలకు ఒకేచోట ఓపెన్ ప్లాట్లు, కట్టిన ఇళ్ల అమ్మకాలకు సంబంధించిన వాటిని ఒకేచోట తెలుసుకునేలా ఈ ఎక్స్‌పో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 25 కంపెనీలు ఈ ఎక్స్‌పోకు వస్తున్నాయని, ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు దీన్ని నిర్వహిస్తుండగా, ప్రతి ఒక్కరికి ఉచితంగా ప్రవేశం ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎక్స్‌పో నిర్వాహకులు బి.కిరణ్, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు పూదెం వెంకటస్వామి, నీలి శ్రీనివాస్, బైరి చంద్రమౌళి, రాజారెడ్డి, కంకణాల శ్యాంసుందర్, వెంకటేశ్‌గౌడ్, ఆకుల రమేశ్, మురారి, దుర్గం అశోక్, పనాస రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిర్యాల రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు

# ఉపాధ్యాయులకు ఫ్రూట్‌సలాడ్ పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక కార్మెల్ హైస్కూల్‌లో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ఫ్రూట్‌సలాడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు ఐస్‌క్రీం, రెండవ రోజు ఫ్రూట్ సలాడ్, మూడో రోజు జొన్న అంబలిలు పంపిణీ చేసి ఉపాధ్యాయులకు అల్పాహారం అందించడాన్ని అభినందించారు. ఎక్టోరల్ అధికారి పద్మజ, ఎంఈవో పోచయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్, గౌరవ అధ్యక్షురాలు శాంకరి, ప్రతిక సంపాదకవర్గ సభ్యుడు రాసపల్లి రవి, కుమారస్వామి, మహేశ్వర్, బుచ్చన్న పాల్గొన్నారు.



ఫ్రూట్‌సలాడ్ పంపిణీ చేస్తున్న డీఈవో

## కిక్ బాక్సింగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో ఈనెల 29, 30వ తేదీల్లో నిర్వహించే కిక్ బాక్సింగ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీలతలు పోటీల ప్రారంభోత్సవానికి రావాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు.

## కేజీబీవీ విద్యార్థినులకు దంతపరీక్షలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక కేజీబీవీలో శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం 201 మంది విద్యార్థినులకు దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. దంత సంరక్షణ గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యులు దీప్తి, సౌమ్య, పీఆర్‌వో మోహన్, స్పెషల్ ఆఫీసర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలపై ఆసక్తి కనబర్చాలి

దండేపల్లి: యువకులు చెడు వ్యవసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి చూపాలని ఎస్సై ప్రసాద్ సూచించారు. కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగాపూర్‌కు చెందిన పలువురు యువకులకు దండేపల్లి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

**యువకులకు క్రికెట్ కిట్ అందజేత**

తాండూర్: తాండూర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాల యువకులకు పోలీసులు క్రికెట్ కిట్లు అందజేశారు. గురువారం రాత్రి నీలాయపల్లి, నర్సాపూర్, మాదారం త్రీ ఇంక్‌లెన్ గ్రామాల్లో ఎస్సై సమ్మయ్య పోలీసు సిబ్బందితో వెళ్లి కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

## మజ్జిగ పంపిణీ

భీమారం: బాల్కసుమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు గొర్రెలు, మేకలపెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌యాదవ్ శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. డుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాజిపల్లి సర్పంచ్ తిరుపతి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను చెల్లించండి

నస్పూర్: మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ రమేశ్ సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నును ఈనెల 30 లోపు చెల్లిస్తే 5 శాతం రిబేట్ రాయితీ వర్తిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్లుప్తంగా

### 'బలగం' ప్రదర్శనలో కేక్ కటింగ్



ప్రేక్షకుల మధ్యన కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్వీసీ జెమిని థియేటర్‌లో బలగం సినిమా ప్రదర్శన సందర్భంగా శుక్రవారం ప్రేక్షకుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బలగం సినిమా 50 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం మ్యాట్నీ షో (1.15 గంటలకు) ప్రదర్శించారు. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందజేయగా ప్రేక్షకులు విశేషంగా తరలి వచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్, థియేటర్ మేనేజర్ మురళీధర్ రావు, సినీ కార్మిక సమాఖ్య అధ్యక్షుడు పోల్సాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీచైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఉన్నత చదువుల నిమిత్తం ప్రమోటైనా విద్యార్థులకు పట్టాలు(సర్టిఫికేట్లు) ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్‌ఎం జోబిన్, డీన్ గజానంద్, ఏవో విలాస్, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### తొలగించిన డ్రైవర్‌ను తీసుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఇటీవల క్వాలిటీ జీఎం అద్దె వాహనంపై పని చేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద రిలేదీక్షలు చేస్తున్న కన్వేయర్స్ డ్రైవర్లకు శుక్రవారం ఆయన మద్దతు తెలిపారు. డ్రైవర్‌ను గతనెల అకారణంగా తొలగించారన్నారు. దీనివల్ల అతని కుటుంబం రోడ్డుపై పడిందని వెంటనే డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మండల కార్యదర్శి రవీందర్, నాయకులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

### దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

బెల్లంపల్లి: దళితరత్న అవార్డు పొందిన బెల్లంపల్లికి చెందిన తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేశ్‌కు ఆత్మీయ సన్మానం జరిగింది. శుక్రవారం మహ్మద్ ఖాశీం బస్తీలోని తాఫీ సంఘం భవనంలో ఎరుకల సంఘం ఇతర కులాల ఆధ్వర్యంలో సన్మానించారు. రాజేశ్‌కు పూలమాల వేసి శాలువ కప్పి సత్కరించారు. కుల, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు దుర్గం గోపాల్, సముద్రాల మురళి, ఉండాడి మల్లయ్య, కామెర దుర్గయ్య, మునీర్, తొగరి సత్యనారాయణ, సమ్మయ్య, శేఖర్, గోపి, చంద్రశేఖర్, నర్సింగ్ పాల్గొన్నారు.

### గర్భిణికి రక్తదానం



రక్తదానం చేస్తున్న సుశాంత్

నెన్నెల: మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణికి సర్జరీ కోసం ఓ నెగిటివ్ గ్రూప్ రక్తం అవసరం ఏర్పడింది. శుక్రవారం మంచిర్యాలలోని జననీ బ్లడ్ బ్యాంకు వారు ఫోన్ చేయగా, నెన్నెలకు చెందిన శ్రీరాంభట్ల సుశాంత్ శర్మ రక్తదానం చేసి ఓ నిండు గర్భిణి ప్రాణం కాపాడాడు. యువకుడు ఇప్పటివరకు 56 సార్లు రక్తదానం, ఎనిమిది సార్లు రక్తకణాలు దానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉన్నవారు 8555 899987 నంబర్‌కు కాల్ చేస్తే రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

### కిష్టంపేటలో గ్రీన్‌ఫ్రైడే

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో గ్రీన్‌ఫ్రైడే సందర్భంగా మండల ప్రత్యేకాధికారి కృష్ణ శుక్రవారం మొక్కలకు నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరందించాలని సూచించారు. నర్సరీలో మొక్కలను సంరక్షించాలన్నారు. ఎంపీడీవో టి.శ్రీనివాస్, సర్పంచ్ బుర్ర రాకేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ ముకుందరెడ్డి, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

# బీజేపీలో బయటపడ్డ వర్గ విభేదాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బీజేపీ పార్టీలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలు బహిర్గతమయ్యాయి. సాక్ష్యాత్తు కేంద్రమంత్రి పురుషోత్తం సమక్షంలో విబేధాలు వెలుగుచూడటం చర్చనీయాంశమైంది. శుక్రవారం బెల్లంపల్లి మినీ బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో అసెంబ్లీ నియోజకవర్గశక్తి కేంద్రాల ఇన్‌చార్జీల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి కేంద్ర ఫిషరీస్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్, పార్టీ జిల్లా ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మల్లికార్జున్ తదితరులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందుగా వేదికపైకి పలువురిని అధ్యక్షత వహించిన రాచర్ల సంతోష్ ఆహ్వానిస్తున్న క్రమంలో సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ వేదికను అకస్మికంగా అలంకరించారు. తాను ఎమ్మెల్యే అభ్యర్థినని తనకు తాను ప్రకటించుకుని వేదిక పై కూర్చుండి పోవడంతో వేదిక కింద కూర్చొని ఉన్న పార్టీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్ అభ్యంతరం తెలిపారు. నిబంధనల ప్రకారం ఏమాజీని వేదికపైకి ఆహ్వానించకపోయిన ఆయన ఎందుకు వెళ్లారని, అందుకు ముఖ్య నాయకులు ఎందుకు సమ్మతించారని రమేశ్ నిలదీశారు. ప్రోటోకాల్ నిబంధన పాటించరా అని రుసరుసలాడుతూ తన అనుచరులతో కలిసి సమావేశం నుంచి బయటకు వెళ్లారు. దీంతో సమావేశంలో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మరికొందరు నాయకులు రమేశ్‌ను బుజ్జగించి తీసుకువచ్చి సమావేశ వేదికపై కూర్చోబెట్టారు. ఇన్నాళ్లుగా నాయకుల మధ్య అంతర్గతంగా సాగిన వర్గ విబేధాలు ప్రోటోకాల్‌తో బయటపడ్డాయి.



బయటకు వెళ్లిపోతున్న రమేశ్

# సామాజిక తనిఖీల్లో అవకతవకలు బహిర్గతం

- మస్టర్ల కొట్టివేతలు, ఇతర అకౌంట్‌లో వేతనాలు
- పూర్తి చేయని ఇంకుడుగుంతలు
- తనిఖీ బృందం వెల్లడి

మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డిసెంబర్ 2019 నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులపై చేపట్టిన తనిఖీ బృందం తనిఖీల్లో అవకతవకలు బయటపడ్డాయి. వీటి నివేదికను డీఆర్‌డీవో శేషాద్రికి నివేదించారు. మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్ రూ.11 కోట్లు, పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి రూ.కోటి 32 లక్షలు, ఫారెస్ట్ విభాగానికి సంబంధించి రూ.5 లక్షల 44 వేలకు పనులకు నిధులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో పది రోజుల పాటు తనిఖీ చేసి గుర్తించిన తేడాలను డీఆర్‌డీవో దృష్టికి తీసుకువచ్చారు. పనుల కొలతల్లో తేడాలు, మస్టర్ రిజిస్టర్‌లో కొట్టివేతలు, ఒకరి వేజెస్ మరొకరి పేరిట జమకావడం, వంద రోజులు పని చేసిన వారిని అదనంగా పని చేయించడంతో వారికి వేజెస్ రాకపోవడం, వేలల్లో నాటిన మొక్కలను కాపాడకపోవడం, వందల్లో బతికి ఉండడం, జీపీల్లో అనుకూలంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయకపోవడం, నిర్దేశిత ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయకపోవడం, కొన్ని రికార్డుల్లో ఏపీవో, ఎంపీడీవో సంతకాలు లేకపోవడాన్ని గుర్తించారు. సుమారు రూ.10 లక్షల పనుల వివరాలు తెలియపర్చలేదు. తనిఖీ బృందం నివేదించిన రిపోర్టుకు ఈజీఎస్ ఏపీవో పలు సమాధానాలు అందించగా మండల వ్యాప్తంగా రూ. 23 వేల 575 రికవరీతోపాటు రూ.2 వేల జరిమానాను ఫీల్డ్ అసిస్టెంట్లకు విధించారు. అడిషనల్ డీఆర్‌డీవో దత్తరావు, ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ వేల్పుల రవి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో బీరయ్య, ఈజీఎస్ విజిలెన్స్ కిరణ్‌కుమార్, ఎస్‌ఆర్‌పీ,రి, డీఆర్‌పీలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీవోకు వివరిస్తున్న డీఆర్‌పీ

# చెవిలో పువ్వులతో నిరసన



దండేపల్లి: చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న వీవోఏలు..



లక్సెట్టిపేట: చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న వీవోఏలు

దండేపల్లి/లక్సెట్టిపేట: ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలు సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా రిలే దీక్షలు చేస్తున్నారు. శుక్రవారం దండేపల్లి. లక్సెట్టిపేటలో రిలే దీక్షలో కూర్చున్న, వీవోఏలు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. తమ న్యాయ పరమైన సమస్యలు పరిష్కరించాలని, అంతవరకు తమ సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర కార్యదర్శి దుర్గం రాములు, గౌరవ అధ్యక్షుడు లింగంపల్లి వెంకటేష్, అధ్యక్షురాలు అనిత, శారద, కళావతి, లావణ్య పాల్గొన్నారు.

భీమారం: స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న వీవోఏల రిలేదీక్షలు శుక్రవారంతో ఐదోరోజుకు చేరింది. దీక్షా కేంద్రాన్ని నాయకుడు దుర్గం అశోక్ సందర్శించి మద్దతు తెలిపారు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి మద్దతు తెలిపారు. వీవోఏలకు రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. నాయకులు మల్లేశ్, వెంకట్‌యాదవ్, రాజేష్, ఖలీల్, వీవోఏల మండల అధ్యక్షుడు పోశం, కార్యదర్శి గాయత్రి, ప్రచార కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు.

జైపూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. వీవోఏలతో పార్టీ మండల అధ్యక్షులు ఫయాజ్, నాయకులు కూర్చున్నారు. వీవోఏల మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు విద్యసాగర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట వీవోఏలు చేపట్టిన సమ్మె ఐదోరోజూకు చేరింది. శుక్రవారం వీవోఏలు ఒంటికాలిపై నిల్చుండి నిరసన తెలిపారు. సతీశ్, సత్యం, సడవలి, రాజ్యలక్ష్మి, స్వరూప, రజిత, రమేశ్, జ్యోతి, శంకర్, బాపు, రోషయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

భీమిని: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీవోఏలు చేపట్టిన సమ్మెకు సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ శుక్రవారం సంఘీభావం తెలిపారు. వీవోఏల న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అనంతరం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర 4వ రోజు రాంపూర్, బిట్టూర్‌పల్లి, జగ్గయ్యపేట, వడాల, మల్లీడి, వీగాం గ్రామాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. పేద ప్రజలకు ఇస్తానన్న మూడెకరాల స్థలం తదితర హామీలే తప్పా ప్రభుత్వం అమలు చేసింది ఒక్కటి లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి శంకర్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు చిప్ప నర్సయ్య, ప్రజాపోరు యాత్ర సభ్యులు రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేశ్ పాల్గొన్నారు.

# దళారులను అరికట్టేందుకే కొనుగోలు కేంద్రాలు

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతాంగానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులో తీసుకురావడంతోపాటు గ్రామాల్లో దళారులను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మండలంలోని ముల్కల్ల, గుడిపేట, రాపల్లి, దొనబండ, పెద్దంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు మాత్రం నిబంధనల మేరకు ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ రమాదేవి, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని జెండావెంకటాపూర్, బలరావుపేట, రంగపేట, ఇటిక్యాల, గుల్లకోట గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



పెద్దంపేటలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## ఘనంగా వాసవీ జయంతి

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థాన ప్రాంగణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వైశాఖమాస ఉత్సవాల్లో భాగంగా వాసవీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 21 నుంచి మే 19 వరకు అమ్మవారికి కుంకుమార్చనతోపాటు వివిధ పూజా కార్యక్రమాలు ఉంటాయని ఈవో ముక్తా రవి తెలిపారు. అర్చకులు బాలక్రిష్ణశర్మ, నరహరిశర్మ పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో ఈవో ముక్తా రవి

# గురుకులం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

బెల్లంపల్లి: గురుకులం అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. శుక్రవారం జరిగిన సీఓఈ ఇంఫాక్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల పాఠశాలను విద్యార్థులు, తల్లిదండ్రులు సొంత ఇల్లుగా భావించాలన్నారు. అనంతరం పిల్లల ప్రగతి నివేదికను తల్లిదండ్రులకు అందజేశారు. జేపీపీ అజిత, పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్, సరిత పాల్గొన్నారు.

# కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలపాలి

భీమారం: ఈనెల 28 నుంచి చేపట్టే పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలపాలని కోరుతూ జెడ్పీటీసీ బుక్యా తిరుమలను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన ప్రొబేషనరీ సమయం పూర్తయినా ఇప్పటివరకు క్రమబద్ధీకరణపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయడం లేదన్నారు. తక్కువ వేతనాలకు గ్రామాల్లో సేవలు అందిస్తున్నామని తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మెకి దిగుతున్నామన్నారు.



జెడ్పీటీసీ తిరుమలకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

## యోగా శిక్షణ తరగతులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో మూడు రోజులపాటు శ్రీరామచంద్ర మిషన్, హార్ట్ ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా శిక్షణ తరగతులను జీఎం మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పంచాయతీలో ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫాను పేద ముస్లిం కుటుంబాలకు ఎంపీపీ రొడ్డ లక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. మద్దిమాడ సర్పంచ్ ఆడె జంగు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు వడ్లూరి మల్లేశ్, ఓసీసీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, మడావి అనంతరావు, సిడం శంకర్, ఖైరు రమెమాన్, ఖాసీం, సాజిద్, అఫ్జల్ తదితరులు ఉన్నారు.

**మందమర్రిలో..**

మందమర్రిరూరల్: పట్టణంలో ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. టీడీపీ కార్యాలయంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సంజయ్‌కుమార్, మొదటి జోన్‌కు చెందిన విశాల్ పేరిట పేరెంట్స్ రాణి శ్రీనివాస్, సెల్ఫ్ డిఫెన్స్, హెల్త్ డిఫెన్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కలీం ఆధ్వర్యంలో ముస్లింలకు సరుకులు అందజేశారు.